ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల
జిల్లా వార్తలు 5

శనివారం 9 నవంబరు 2024

నంద్యాల డీఎస్పీగా శ్రీనివాసరెడ్డి

నంద్యాల క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నంద్యాల డీఎస్పీగా పి.శ్రీనివాసరెడ్డిని నియమించారు. సాధారణ బదిలీల్లో భాగంగా పలువురు డీఎస్పీలకు ఉన్నతాధికారులు పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈ మేరకు నంద్యాల డీఎస్పీగా పి. శ్రీనివాసరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. నంద్యాలలో డీఎస్పీగా పనిచేస్తున్న ఎన్. యుగంధర్‌బాబు ఇటీవలే పదోన్నతిపై నంద్యాల అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)గా బాధ్యతలు స్వీకరించారు.

- అద్భుత ఘట్టానికి వేదికగా శ్రీశైలం
- పాతాళగంగలో ట్రైల్ రన్ విజయవంతం
- నేడు డెమోను ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- శ్రీశైలం-విజయవాడ క్షేత్రాల నడుమ టెంపుల్ టూరిజం
- గంటలోపే ఇంద్రకీలాద్రికి చేరుకునే అవకాశం
- ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ
- నల్లమలను జల్లెడ పట్టిన ప్రత్యేక బలగాలు

ఇల కైలాసానికి సీప్లేన్

మరో అద్భుత ఘట్టానికి శ్రీశైలం పాతాళ గంగ వేదిక కానుంది. టూరిజాన్ని అభివృద్ధి చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం సీప్లేన్ టూరిజానికి శ్రీకారం చుట్టనుంది. విజయవాడ ఇంద్రకీలాద్రి, శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయాల మధ్య టెంపుల్ టూరిజం మరింత అభివృద్ధి కానుంది. అందులో భాగంగా సీప్లేన్ రవాణా మార్గానికి ప్రణాళిక రూపొందించింది. ఈ క్రమంలో శుక్రవారం మొదట విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి బయల్దేరిన సీ ప్లేన్ శ్రీశైలంలో సందడి చేసింది. శ్రీశైలం జలాశయం నీటిపై తేలుతూ సురక్షితంగా ల్యాండ్ అయింది. శ్రీశైలం టూరిజం బోటింగ్ జెట్టీ వద్దకు నీటి విమానం రాగానే అధికారులు ఆనందం వ్యక్తం చేశారు. ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, టూరిజం, ఎయిర్ ఫోర్స్ అధికారుల సమక్షంలో ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించారు. శనివారం కృష్ణానది పున్నమిఘాట్ నుంచి విజయవాడ నుంచి శ్రీశైలం మధ్య సీ ప్లేన్ పరుగులు తీయనుంది. డీ హావిల్లాండ్ ఎయిర్ క్రాఫ్ట్ సంస్థ రూపొందించిన ఈ సీ ప్లేన్‌లో 14 మంది ప్రయాణించేలా సీటింగ్ ఏర్పాటు చేశారు. సాధారణంగా విజయవాడ-శ్రీశైలం మధ్య రోడ్డు మార్గంలో సుమారు 270 కిలోమీటర్ల దూరం ఉంటుంది. రోడ్డు మార్గం ద్వారా అయితే ఆరు గంటలకు పైగా సమయం పడుతుంది. అదే సీ ప్లేన్‌లో గంటన్నర సమయంలోనే చేరుకోవచ్చు.

వివరాలు 6లో..



విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

- తానా అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్
- రాజనగరంలో సైకిళ్లు, కుట్టుమిషన్ల పంపిణీ



మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న తానా అధ్యక్షుడు నిరంజన్, ఎంపీ బైరెడ్డి శబరి

శిరివెళ్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్ పేర్కొన్నారు. శనివారం శిరివెళ్ల మండలం రాజనగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన విద్యార్థులకు సైకిళ్లు, మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ తానా ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో మహిళల ఆర్థికాభివృద్ధికి, ప్రజలకు విద్య, వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాజనగరం గ్రామాభివృద్ధికి ఎల్లవేళలా ముందుంటామని అన్నారు. నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ నిరంజన్ అమెరికాలో స్థిరపడి ఉన్నతస్థానానికి వెళ్లి పుట్టిపెరిగిన గ్రామంలో సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఆయన్ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం నిరంజన్ తల్లి శృంగవరపు ఇంద్రావతి జ్ఞాపకార్థం తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వంద మంది విద్యార్థులకు సైకిళ్లు, యాభై మంది మహిళలకు కుట్టుమిషన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో శృంగవరపు సుబ్రమణ్యేశ్వరరావు, వేణు వరప్రసాద్, విజయ్ కుమార్, మాలపాటి పుల్లయ్య చౌదరి, టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, కుందూరు మోహన్‌రెడ్డి, ఎస్‌పీ లాల్, కొండలరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

శ్రీశైలం అభివృద్ధిలో చంద్రబాబు ముద్ర

- గత టీడీపీ ప్రభుత్వంలో రూ.580 కోట్ల మాస్టర్ ప్లాన్
- టీటీడీ తరహాలో ప్రగతి.. టూరిజం డెవలప్‌మెంట్

కర్నూలు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం.. దక్షిణ కాశిగా ప్రసిద్ధి. జ్యోతిర్లింగాల్లో ద్వితీయ జ్యోతిర్లింగం.. అష్టాదశ శక్తిపీఠాల్లో ఆరోశక్తి పీఠం.. ఈ రెండు కలయిక దివ్యక్షేత్రం. భ్రమరాంబికదేవి. శ్రీమల్లికార్జునుడు ఇద్దరు ఒకే సన్నిధానంలో కొలువైనందున శివశక్తి క్షేత్రంగా తేజోమయమై దినదినాభివృద్ధి చెందుతోంది. ఈ దివ్యక్షేత్రం పదేళ్ల క్రితం, ఆ తరువాత చూసిన వారికి ప్రగతి పరుగులు పెడుతున్న తీరు స్పష్టంగా కనిపిస్తుంది. 2014 తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నాయుడు 2016లో కృష్ణా పుష్కరాల కోసం శ్రీశైలం వచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరహాలో అభివృద్ధి చేయాలని సంకల్పించారు. రూ.580 కోట్లతో ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందించారు. పక్కాగా అమలు చేసేందుకు ఐఏఎస్ అధికారి భరత్‌గుప్తాను శ్రీశైలం దేవస్థానం ఈవోగా నియమించారు. ఆనాడు చంద్రబాబు వేసిన పునాదులపై శివశక్తి పీఠం ఊహించని ప్రగతి సాధించింది. ఈ ఏడాది జూన్ 12న నాలుగోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు భక్తుల సౌకర్యార్థం, దేవాలయ పర్యాటక (టెంపుల్ టూరిజం) అభివృద్ధిలో భాగంగా సోమశిల, నాగార్జునసాగర్ నుంచి బోటు సౌకర్యం కల్పించారు. తాజాగా విజయవాడ నుంచి శ్రీశైలానికి 'సీ ప్లేన్' రవాణాకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది.

(మిగతా 7లో)



శ్రీశైలం నుంచి పాతాళ గంగకు వెళ్లే రోప్ వే

శ్రీశైల దేవస్థానం సీఎస్‌వోగా స్వాములు

శ్రీశైలం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం సహాయ కార్యనిర్వహణాధికారి జి. స్వాములుకు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆలయ ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారి ఇ.చంద్రశేఖరరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయ్యన్న అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు, ఫిర్యాదులు రావడంతో ఇన్‌చార్జి ఈవో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

ఇల శ్రీశైలానికి సీప్లేన్


- ట్రయల్ రన్ విజయవంతం
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ
- నేడు సీప్లేన్‌లో శ్రీశైలానికి సీఎం చంద్రబాబు
- శ్రీశైలం అడవులను జల్లెడ పట్టిన భద్రతా బలగాలు






శ్రీశైలం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం ఉదయం సీప్లేన్ ద్వారా శ్రీశైలం చేరుకోనున్నారు. విజయవాడ-శ్రీశైలం మధ్య సీప్లేన్ సర్వీసు డెమో కార్యక్రమాన్ని విజయవాడ పున్నమి ఘాట్ వద్ద ప్రారంభించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, జేసీ విష్ణు చరణ్, సీఎం కార్యక్రమాల కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు ఏర్పాట్లను పరిశీలించారు. ఇందులో భాగంగా సీప్లేన్ ల్యాండ్ అయ్యే ప్రదేశం, పాతాళగంగ బోటింగ్ ప్రదేశం నుంచి రోప్ వే, అక్కడి నుంచి స్వామి, అమ్మవార్ల దర్శనం ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సీఎం పర్యటనలో 523 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితోపాటు పది స్పెషల్ పార్టీ బృందాలు, నాలుగు గ్రేహౌండ్స్ బృందాలతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లుగా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. శ్రీశైలం పాతాళగంగ, డ్యాం పరిసర ప్రాంతాల్లో గ్రేహౌండ్స్, పది స్పెషల్ పార్టీల బలగాలతో శ్రీశైలం అడవులన్నింటిని జల్లెడ పట్టామని తెలిపారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి



● సీఎం పర్యటన ఇలా..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'స్కై-మీట్స్ సీ' పేరుతో చేపట్టిన విజయవాడ-శ్రీశైలం సీప్లేన్ సర్వీసును విజయవాడ పున్నమి ఘాట్ వద్ద శనివారం ఉదయం 10:55 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. తరువాత 12 గంటలకు సీప్లేన్‌లో బయలుదేరి 12:45 గంటలకు శ్రీశైలం పాతాళగంగ కృష్ణా నదిపై లాండింగ్ అవుతారు. అనంతరం రోప్‌వే లోవర్ స్టేషన్ నుంచి రోప్‌వే అప్పర్ స్టేషన్‌కు ఒంటి గంటకు చేరుకుంటారు. అక్కడి నుంచి సీఎం కాన్వాయ్ ద్వారా రోడ్డు మార్గంలో స్వామి, అమ్మవార్ల ప్రధాన ఆలయం వద్దకు చేరుకోనున్నారు. 1:05 నుంచి 1:25 గంటల సమయంలో సీఎం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దర్శనానంతరం తిరిగి 1:30 గంటలకు కాన్వాయ్ ద్వారా రోప్‌వే అప్పర్ స్టేషన్‌కు చేరుకుని 2 గంటలకు మీడియాతో సమావేశం కానున్నారు. తరువాత 2:30 గంటలకు రోప్‌వే ద్వారా సీప్లేన్ చేరుకుని విజయవాడకు చేరుకోనున్నారు.





● సీప్లేన్ ట్రైల్ రన్

విజయవంతం ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో శుక్రవారం విజయవాడ నుంచి శ్రీశైలం సీప్లేన్ ట్రయల్ రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం విజయవాడ పున్నమి ఘాట్ నుంచి సీప్లేన్ 10.30 గంటల సమయంలో బయలుదేరి శ్రీశైలం పాతాళగంగ వద్ద కృష్ణా నదిపై చెక్కర్లు కొట్టి 11.30-12 గంటల సమయంలో ల్యాండ్ అయింది. శ్రీశైలం చేరుకున్న సీప్లేన్‌ను కలెక్టర్ జి. రాజకుమారి ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం పర్యటించే పాతాళగంగ బోటింగ్, రోప్‌వే ఎంట్రీ పాయింట్ నుంచి రోడ్డు మార్గం, స్వామి, అమ్మవార్ల ఆలయ ప్రదేశాల ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించి పకడ్బందీ ఏర్పాట్లను చేపట్టారు.

● హాజరు కానున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు

ముఖ్యమంత్రి శ్రీశైలం పర్యటన సందర్భంగా పలువురు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే హాజరు కానున్నారు. మంత్రులు రామనారాయణ రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి, నిమ్మల రామనాయుడు, గొట్టిపాటి రవికుమార్, ఎంపీలు బైరెడ్డి శబరి, బి. నాగరాజు, ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖరరెడ్డి, జి. జయసూర్య, భూమా అఖిలప్రియ రెడ్డి, గౌరు చరితారెడ్డి, జయనాగేశ్వరరెడ్డి, బి. దస్తగిరి, పార్థసారధి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్‌రెడ్డి, దేవదాయశాఖ కమిషనరు ఎస్. సత్యనారాయణలు హాజరుకానున్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ


శ్రీశైలంలో ట్రయల్ రన్

గ్రామాభివృద్ధికి సహకరించండి

-జిల్లా పంచాయతీ అధికారి ఎల్. భాస్కర్



మాట్లాడుతున్న డీపీఓ ఎల్. భాస్కర్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కర్నూలు జిల్లా పంచాయతీ అధికారి ఎల్.భాస్కర్ అన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీఓలు, ఈఓఆర్‌డీలు, పంచాయతీ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్లకు డీపీఆర్‌సీలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ నెల 5, 6 తేదీలలో ఒక బ్యాచ్ 7, 8 తేదీలలో రెండవ బ్యాచ్‌కు శిక్షణ ఇచ్చారు. ప్రజాప్రణాళిక ప్రచారం(2024-25) ద్వారా పంచయతీ అభివృద్ధి ప్రణాళిక(2025-26) తయారీ ప్రక్రియపై జిల్లా స్థాయి టీఓటీలు అవగాహన కల్పించారు. శిక్షణ తీసుకున్న వారందరూ ఈ నెల 12, 16 తేదీలలో సంబంధిత మండలాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, మండల స్థాయి లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఎంపీడీఓలు రఘునాథ్, శ్రీనివాసులు, రాముడు, శివనాగప్రసాద్, మణిమంజరి పాల్గొన్నారు.

15 వరకు ప్రత్యేక శిబిరాలు

● పోస్టల్ సూపరింటెండెంట్ జి. జనార్దనరెడ్డి



కర్నూలు న్యూసిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కొత్త ఐపీపీబీ ఖాతాలను ప్రారంభించేందుకు ఈ నెల 15 వరకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు కర్నూలు డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ జి. జనార్దన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తపాలా శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్(ఐపీపీబీ) ద్వారా కొత్త ఖాతాలను తెరవనున్నట్లు, ఆధార్ లింకేజీని సులభతరం చేయనున్నట్లు తెలిపారు. దీని కోసమే క్యాంపులను డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) లబ్ధిదారుల కోసం నిర్వహిస్తున్నామన్నారు.

జిల్లా అఫీషియల్ రిసీవర్‌గా న్యాయవాది ఎస్. బాబు సాహెబ్



కర్నూలు లీగల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా అఫీషియల్ రిసీవర్‌గా స్థానిక న్యాయవాది ఎస్. బాబు సాహెబ్ నియమితులయ్యారు. రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వుల మేరకు కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది ఈయనను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఈయన శుక్రవారం కర్నూలు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి జ్యోత్స్న దేవిని కలిసి తన నియామక పత్రాలను అందజేసి బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో దాఖలైన ఐపీ కేసులలో ఉన్న ఆస్తుల వ్యవహారాలను ఈయన పర్యవేక్షిస్తారు. ఆయనను పలువురు అభినందించారు.

కర్నూలులో ప్రత్యక్షమైన అఘోరీ

- బళ్లారి చౌరస్తా నుంచి గుత్తి రోడ్డు వైపు వెళ్లిన నాగసాధువు
- యాగంటి వెళ్లి పూజలు చేస్తానని వెల్లడించిన వైనం

కర్నూలు కల్చరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో హల్‌చల్ చేస్తున్న మహిళా అఘోరీ శుక్రవారం కర్నూలులో ప్రత్యక్షమైంది. మధ్యాహ్న సమయంలో నగరంలోని బళ్లారి చౌరస్తా నుంచి గుత్తి రోడ్డు వైపు హైదరాబాదు - బెంగళూరు జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్లింది. స్థానికులు మొదట ఆమెను వింతగా చూసి ఆ తర్వాత మొక్కేందుకు ప్రయత్నించారు. కొందరు యువకులు సెల్ఫీలు తీసుకునే యత్నం చేయగా వారిని దాటుకుంటూ ఆమె ముందుకు సాగారు. ఐటీ సర్కిల్ వద్ద ఒక మహిళా భక్తురాలు ఇచ్చిన మంచినీటిని తాగి కొద్దిసేపు రోడ్డు పక్కన డివైడర్‌పై కూర్చుండిపోయారు. పోలీసులు ఇబ్బంది పెట్టడం వల్లే తన కారు ప్రమాదం జరిగిందని అన్నారు. పోలీసులు ఇంకా ఎన్ని ఇబ్బందులు పెడతారో పెట్టండి.. చంపేయండి లేదా ఉరిశిక్ష వేస్తే పీడపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కారు ఎప్పుడు తన చేతికి వస్తుందో తెలియదని, కారు రిపేరు అయ్యేంత వరకు పాదయాత్ర చేస్తూనే ఉంటానని చెప్పారు. ప్రస్తుతం యాగంటికి వెళుతున్నానని, తర్వాత మహానంది, శ్రీశైలం వెళ్లి పూజలు చేస్తానని ఆమె తెలిపారు. కాగా ఓర్వకల్లు మండలంలోని పూడిచెర్లకు రాగానే పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో భక్తులు అధికంగా రావడంతో అఘోరీ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తాను వెళ్లాల్సిందేనని పట్టుపట్టారు. చివరకు ఆమె అక్కడే బైఠాయించారు.


హైదరాబాదు - బెంగళూరు జాతీయ రహదారిపై పాదయాత్రగా వెళుతున్న మహిళా అఘోరీ

చెంప పగులగొడతా.. వెళ్లిపో..!

- ఓ గర్భిణిపై డ్యూటీ డాక్టర్ దురుసు ప్రవర్తన
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితురాలు



కర్నూలు హాస్పిటల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓ ఐదు నెలల గర్భిణికి అవమానకర ఘటన ఎదురైంది. దీంతో బాధితురాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఆ వివరాలు ఇలా.. కర్నూలు నగరం పాతబస్తాండుకు చెందిన గర్భిణి లక్ష్మీకాంతమ్మ కడుపు నొప్పితో బాధపడుతూ గురువారం తెల్లవారు జామున 2 గంటల సమయంలో ఆసుపత్రిలోని గైనిక్ వార్డుకు వెళ్లింది. ఆ సమయంలో డ్యూటీలో ఉన్న డాక్టర్ ఆమె పట్ల చాలా దారుణంగా ప్రవర్తించారు. గంటసేపు కూర్చోబెట్టి 'నీ మొహం చూడలేనని.. చికిత్స చేయలేనని.. వెళ్లిపొమ్మని' హెచ్చరించారు. దీంతో బాధ వేసి ఆ గర్భిణి బయటకు వెళ్లిపోయింది. ఆమె భర్త ఈ సమయంలో ఎవరూ చూడరని నచ్చజెప్పి మరలా లోపలికి తీసుకెళ్లాడు. దీంతో ఆ డాక్టర్ మరోసారి కోపంతో ఊగిపోయారు. చెంప పగులకొడతానని అనడంతో మనస్తాపానికి గురై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కే వెంకటేశ్వర్లు ముగ్గురు వైద్యులతో విచారణ కమిటీ వేశారు. ఈ కమిటీలో మెడిసిన్ హెచ్‌వోడీ డా.ఎస్.లక్ష్మీబాయి, గైనిక్ హెచ్‌వోడీ డా.ఎ.శ్రీలక్ష్మి, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా.బి. హేమనళిని ఉంటారని, విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

నాటి కలిమి గుళ్లే.. నేటి కొలిమిగుండ్ల

ఊరి పేరు కథ

- పల్లవ రాజుల పాలనకు సజీవ సాక్ష్యం
- రాష్ట్ర వ్యాప్తంగా మూడు చోట్ల ఈ నిర్మాణాలు
- ఎటుచూసినా మూడు గుళ్లుగా కనిపించే అద్భుత కట్టడం

కొలిమిగుండ్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొలిమిగుండ్ల మండల కేంద్రానికి వాయవ్య దిశలో వెలసిన కలిమి గుళ్ల (మూడు గుళ్లు) 9వ శతాబ్దంలోని పల్లవరాజుల పాలనకు సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. కలిమి అనగా సంపద. పల్లవరాజుల కాలంలో సంపదను దాచడానికి ఈ గుళ్లు ఏర్పాటు చేసి అందులోనే విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించి పూజలు చేసేవారు. ఈ క్రమంలో నిర్మించిన కలిమిగుళ్ల గ్రామమే కాలక్రమంలో కొలిమిగుండ్లగా రూపాంతరం చెందింది. క్రీస్తు శకం 1900 శతాబ్దంలో గద్వాల సంస్థానాన్ని సందర్శించిన కొలిమిగుండ్లకు చెందిన కవి బోయన నరసింహులు అక్కడ రాసిన తన సాహిత్యం లో కలిమిగుళ్ల గురించి,



కొలిమిగుండ్ల మండలంలోని బెలుం గుహలు



వాటి ప్రాశస్త్యం గురించి విపులంగా విశదీకరించినట్లు తెలుస్తోంది. 9వ శతాబ్దంలో పల్లవ రాజుల వంశానికి చెంది న రాజు రాజమహేంద్రవర్మ శైవమత ప్రచారంలో భాగంగా అద్భుతమైన కళా నైపుణ్యంతో ఈ కలిమిగుళ్ల నిర్మించారు. వీటినే స్థానికులు మూడుగుళ్లుగా పిలుస్తారు. వాస్తవానికి ఇవి నాలుగు గుళ్లు. కానీ దూరం నుంచి ఎటువైపు చూసినా మూడుగుళ్లుగా మాత్రమే కనిపిస్తాయి. ఇదే కలిమిగుళ్ల నిర్మాణ ప్రత్యేకతగా చెబుతారు. పల్లవ రాజులు శైవ మతానికి చెందిన వారు కావడంతో శైవమత ప్రచారంలో భాగంగా ఈ నాలుగు గుళ్లు నిర్మించి, ఇందులో గణపతి, పార్వతీ దేవి, ఈశ్వరుడు, వీరభద్ర స్వాములను ప్రతిష్ఠించారు. ఈశ్వరునికి ఉత్తర దిశలో వీరభద్రుడు, గణపతి, పడమరలో పార్వతీదేవి, తూర్పు మధ్య భాగంలో ధ్వజస్తంభం, ఈశాన్యంలో నాగులకట్ట, దక్షిణ ఆగ్నేయంలో దిగుడు బావి, నైరుతి దిశలో జమ్మి చెట్టు ఉన్నాయి.

శిథిలావస్థలో మూడు గుళ్లు

ఎంతో విశిష్టత కలిగిన ఈ మూడు గుళ్లు (కలిమి గుళ్లు) ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. విగ్రహాలు, ధ్వజస్తంభం, బావి ఆనవాళ్లు కూడా లేకుండా పోయా యి. ఈ గుళ్ల సంరక్షణకు ఎటువంటి మాన్యాలు లేకపోవడంతో ఈ గుళ్లు ఆలనాపాలనాకు నోచుకోక శిథిలమవుతున్నాయి. స్థానికులు వీటి పరిసరాలను ఆక్రమించి పెంట దిబ్బలుగా ఉపయోగించుకుంటున్నారు. 1995లో ఈ ఆలయాలపై అనంతపురానికి చెందిన ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ వారు పరిశోధించి ఆలయ ప్రాంగణంలో తవ్వకాలు జరపగా సింధూ నాగరికత అవశేషాలు లభించాలయని స్థానిక పెద్దలు వెల్లడిస్తున్నారు.


మూడుగా కనిపిస్తున్న కలిమిగుళ్లు

రాష్ట్రంలో మూడు చోట్ల ఈ ఆలయాలు

అరుదైన కట్టడాలు ఉన్న ఇలాంటి గుళ్లు రాష్ట్రంలో మూడు చోట్ల ఉన్నట్లు పురావస్తు శాఖ అధికారులు గుర్తించారు. బనగానపల్లె మండలంలోని నందవరం, చిత్తూరు జిల్లా వాయల్పాడు గ్రామంలో ఈ కలిమి గుళ్లను పోలి ఉన్న గుళ్లు ఉన్నాయి. ఎంతో ప్రాధాన్యతను కలిగి ఉండటంతోపాటు కొలిమిగుండ్ల ఆవిర్భావానికి రూపాంతరాలైన కలిమిగుళ్లను సంరక్షించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.






శ్రీశైలం అభివృద్ధిలో చంద్రబాబు మార్క్

- గత టీడీపీ ప్రభుత్వంలో రూ.580 కోట్ల మాస్టర్ ప్లాన్
- ఔటర్ రింగ్ రోడ్, మాడ వీధుల నిర్మాణం
- సోమశిల, నాగార్జునసాగర్ నుంచి బోటింగ్
- తాజాగా విజయవాడ - శ్రీశైలం మధ్య సీ ప్లేన్

(5వ పేజీ తరువాయి)





● టీటీడీ తరహాలో అభివృద్ధి

శ్రీశైలం క్షేత్రం దేవదాయ శాఖ అధ్వర్యంలో ప్రగతి అడుగులు వేసినా.. 2016 తరువాత జరిగిన అభివృద్ధే చరిత్రలో నిలిచిపోతుంది. అందుకు ప్రధాన కారణం తిరుమల తిరుపతి దేవస్థానం (టీడీపీ)లాగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో నాటి సీఎం చంద్రబాబు రూ.580 కోట్లు అంచనాలతో మాస్టర్ ప్లాన్‌కు రూపకల్పన చేశారు. నిధులు ఇచ్చి పనులకు శ్రీకారం చుట్టారు. ఆయలం చుట్టూ మాడవీధులు, ఔటర్ రింగ్ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, డార్మెంటరీలు, లలితాంబికదేవి కాంప్లెక్స్, సోలార్ దీపాలు, అన్నపూర్ణ సదన్, విశాలమైన రహదారులు, పచ్చదనం.. వంటి పనులతో శ్రీశైలం దేవస్థానం ప్రగతిని పరుగులు పెట్టించారు. పదేళ్ల క్రితంతో పోలిస్తే శ్రీశైలం అభివృద్ధి చరిత్రలో నిలిచిపోతుందని భక్తులు పేర్కొంటున్నారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో ప్రగతి ఆగిపోయినా.. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో ప్రగతి పరుగులు అందుకుంది. దేవాలయం పర్యాటక క్షేత్రం (టెంపుల్ టూరిజం) అభివృద్ధిలో భాగంగా దక్షిణ కాశిగా పేరుగాంచిన శ్రీశైలం మల్లన్న దర్శనానికి వచ్చే భక్తులకు ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్నారు.

● సీ ప్లేన్, బోటింగ్‌తో టూరిజం అభివృద్ధి

సీఎం చంద్రబాబు సారథ్యంలో కొలువుదీరిన టీడీపీ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని పర్యాటకంగా, సాంకేతికంగా అభివృద్ధి చేసేందుకు పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే శ్రీశైలం జలాశయం దిగువన నాగార్జున సాగర్, ఎగువన సోమశిల నుంచి బోటింగ్ సౌకర్యం కల్పించారు. కృష్ణమ్మ జల పరవళ్లు, వంపుసొంపులు, నల్లమల పచ్చని అందాలను వీక్షిస్తూ శ్రీశైలం చేరుకునే అవకాశం కల్పించారు. భక్తులు, పర్యాటక ప్రేమికులు జల మార్గంలో గగత విహారం చేసేలా సీ ప్లేన్ ప్రారంభోత్సవం చేయబోతున్నారు. అంటే.. మల్లన్న క్షేత్రానికి వివిధ మార్గాల్లో చేరుకునే భక్తుల సంఖ్య గణనీయంగా పెరగనుంది. దీంతో పర్యాటకం అభివృద్ధిలో పరుగులు తీయనుంది.

చంద్రబాబు చొరవతోనే...

- బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే



సీఎం చంద్రబాబుతోనే శ్రీశైల క్షేత్రం అన్నివిధాలుగా అభివృద్ధి చెందింది. గతంలో 2014-2019 హయంలో క్షేత్రంలో టెంపుల్ టూరిజం కింద రింగ్‌రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, మాడవీధుల నిర్మాణంతో పాటు క్యూకాంప్లెక్స్, ఆలయ ప్రధాన ద్వారం నుంచి నందిసర్కిల్ వరకు సాలా మండపాల నిర్మాణాలకు ప్రతిపాదనలు జరిగాయి. అయితే వైసీపీ అధికారంలోకి రావడంతో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. శ్రీశైలాన్ని ఆధ్యాత్మికంగా, సున్నిపెంట, లింగాలగట్టును పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతంలోని యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

వీటిపైనా దృష్టి సారించాలి

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో టూరిజం సర్క్యూట్‌కు ప్రసిద్ధి. యాగంటి, అహోబిళం, మహానంది, కొలనుభారతి క్షేత్రం, మంత్రాలయం, ఉరుకుంద ఈరన్న.. వంటి ఆధ్యాత్మిక క్షేత్రాలలో పాటు, కర్నూలు నగర శివారున జగన్నాథగట్టు, కొండారెడ్డిబురుజు, బనగానపల్లె నవాబులకోట, బెలూంగుహాలు.. వంటి పర్యాటక క్షేత్రాలు ఎన్నో ఉన్నాయి. వాటి అభివృద్ధి కోసం కూడా ప్రత్యేక నిధులు కేటాయించాలి. శ్రీశైలం జలాశయం రక్షణ చర్యలు, పర్యాటక అభివృద్ధిపై దృష్టి సారించాలి. ఉమ్మడి జిల్లాల్లో అసంపూర్తిగా ఉన్న వేదవతి ప్రాజెక్టు, ఆర్డీఎస్ కుడి కాలువ, గాజులదిన్నె ప్రాజెక్టు, నగరడోణ జలాశయం నిర్మాణాలు పూర్తి చేయాలి. హంద్రీనీవా పత్తికొండ జలాశయం కుడి ఎడమ కాలువలకు నిధులు ఇవ్వాలి. అలగనూరు జలాశయం మరమ్మతులు తక్షణమే చేపట్టాలి. రాయలసీమ జిల్లా చిరకాల స్వప్నమైన తుంగభద్రపై గుండ్రేవుల జలాశయం, శ్రీశైలం ఎగువన కృష్ణా నదిపై సిద్ధేశ్వరం అలుగు నిర్మాణంపై తక్షణ చర్యలు తీసుకోవాలి. వీటిపై సీమ రైతులకు స్పష్టమైన హామీ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వీటితో పాటు అసంపూర్తిగా ఉన్న క్లస్టర్ యూనిర్సిటీ, ఉర్దూ విశ్వవిద్యాలయం, ఆదోని, కర్నూలు ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణాలు, రాయలసీమ విశ్వవిద్యాలయం అనుబంధ ఇంజనీరింగ్ కాలేజీ నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రజలు విన్నవిస్తున్నారు.

మ్యాపింగ్‌పై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న డీఆర్వో నారాయణమ్మ

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను రిజిస్ట్రేషన్ చేసి మ్యాపింగ్ చేయడంపై అవగాహన ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకట నారాయణమ్మ ఆపరేటర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్-పీజీ ఆర్ఎస్ అర్జీలుతప్పులు లేకుండా రిజిస్ట్రేషన్ చేసి మ్యాపింగ్ చేసేలా కంప్యూటర్ ఆపరేటర్లకు జిల్లా రెవెన్యూ అధికారి శిక్షణ నిర్వహించారు. దరఖాస్తులను కంప్యూటర్‌లో తప్పులు లేకుండా రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత వచ్చిన అర్జీని సంబంధిత డిపార్టుమెంట్‌కు పంపించేలా మ్యాపింగ్ చేయాలన్నారు. కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగ ప్రసన్నలక్ష్మి, జిల్లా స్థాయి అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య

- ఉసురు తీసిన అప్పు



జగన్ (ఫైల్)

కోడుమూరు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లపరి గ్రామంలో అప్పులబాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన యాగంటి జగన్, ఉరుకుందమ్మ దంపతులకు వ్యవసాయమే జీవనాధారం. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. జగన్ (41) పదేళ్ల నుంచి వారసత్వంగా వచ్చిన 2 ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నాడు. పంటలు కలిసిరాక ఐదేళ్ల క్రితం ఎకరా పొలం అప్పు కింద రాసి చ్చాడు. దీనికితోడు ప్రమాదంలో కాలు విరిగి బాగా ఖర్చు అయ్యింది. అయినా కుంగిపోకుండా అప్పులు తీర్చడానికి మరో 3 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి, కంది, ఉల్లి, మొక్కజొన్న వంటి పంటలు చేశాడు. ఐదేళ్లుగా పంటలు కలిసిరాక అప్పులు మరింత పెరిగిపోయాయి. దీంతో ఇల్లు కూడా కుదువపెట్టాడు. దీంతో తీవ్రమైన మనో వ్యథకు గురయ్యాడు. శుక్రవారం తెల్లవారు జామున ఇంట్లో కొక్కెంకు పంచెతో ఉరివేసుకున్నాడు. నిద్రలేచిన భార్యాపిల్లలు చూసి ఇరుగుపొరుగు వారి సాయంతో జగన్‌ను కిందకు దించారు. హుటాహుటిన కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సుమారు రూ. 15 లక్షల అప్పు ఉందని రైతు భార్య ఉరుకుందమ్మ తెలిపింది. వైద్యులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న పార్వతి

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడికల్లు గ్రామంలో పార్వతి అనే మహిళ శుక్రవారం గొంతు కోసుకుంది. గ్రామస్థులు, పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోయ అంజినయ్య భార్య నాలుగేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా ఆరోగ్యం బాగుపడలేదు. దీంతో పార్వతి మన స్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. స్థానికులు, కుటుంబ సభ్యులు ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైతులను శాస్త్రవేత్తలుగా చేయాలి



మాట్లాడుతున్న డీఆర్సీ కేంద్రం డీడీఏ శ్రీలత

- డీడీఏ శ్రీలత

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పంటల సాగులో మెలకువలు నేర్పిస్తూ రైతులను శాస్త్రవేత్తలుగా తయారు చేయాల్సిన బాధ్యత ఏఈవోలు, వీహెచ్ఏలది అని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శ్రీలత అన్నారు. శుక్రవారం ఏడీఏ కార్యాలయం ఆత్మ భవనంలో సబ్ డివిజన్ పరిధిలోని గ్రామ రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ, అనుబంధ శాఖల సిబ్బందికి రబీ సీజన్ పంటల సాగుపై శిక్షణా తరగతులను ఏడీఏ అరుణకుమారి అధ్యక్షతన నిర్వహించారు. రబీలో ప్రధానమైన పంటల సాగులో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందేలా సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. పప్పుశనగ, వేరుశనగకు సోకే తెగుళ్ల, పురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కేవీకే శాస్త్రవేత్త రాఘవేంద్ర వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వెంకటేశ్వర్లు, కౌతాళం ఏవో శేషాద్రి, పెద్దకడబూరు ఏవో ప్రసాద్ పాల్గొన్నారు.

20 మంది సీఐల బదిలీ

కర్నూలు క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు అనంతపురం రేంజ్ పరిధిలో 20 మంది సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ డా.కోయ ప్రవీణ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా పోలీసుల పని తీరుపైన దృష్టి పెట్టిన ప్రభుత్వం వైసీపీకి అండగా నిలిచిన పోలీసులపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో కొంత మంది సీఐలను బదిలీ చేశారు. అయితే ఈ బదిలీల్లో కూడా వైసీపీకి అంటకాగిన సీఐలకు పోస్టింగ్ దక్కడం విశేషం. గతంలో వైసీపీ హయాంలో ఓ మంత్రి నియోజకవర్గంలో పని చేసిన సీఐ వైసీపీ ఎమ్మెల్యే టికెట్ ఆశించినట్లు అప్పట్లో వార్తలు గుప్పుమన్నాయి. ఆ సీఐకి ప్రస్తుతం ప్రధాన స్టేషన్‌ను కేటాయించడం విశేషం.

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
వి.శ్రీనివాసులు	సోషల్ మీడియా, సైబర్ క్రైం సెల్, కర్నూలు	ఎమ్మిగనూరు యూపీఎస్
ఎ.వేణుగోపాల్	వీఆర్, కర్నూలు	సోషల్ మీడియా, సైబర్ క్రైం సెల్, కర్నూలు
కే.ప్రవీణ్ కుమార్	సీసీఎస్-2, కర్నూలు	బనగానపల్లె యూపీఎస్, నంద్యాల
ఎన్.కృష్ణయ్య	బనగానపల్లె యూపీఎస్, నంద్యాల	సీసీఎస్-3 నంద్యాల
ఎస్.మహ్మద్ ఆలీ	వీఆర్, కడప	మన్నూరు యూపీఎస్, అన్నమయ్య జిల్లా
డి.రామాంజనేయుడు	మన్నూరు యూపీఎస్, అన్నమయ్య జిల్లా	వీఆర్, అన్నమయ్య
బి.లక్ష్మన్న	ఉమెన్ పీఎస్, చిత్తూరు జిల్లా	మొలకలచెరువు సర్కిల్, అన్నమయ్య జిల్లా
పి.రాజా రమేష్	మొలకలచెరువు సర్కిల్, అన్నమయ్య జిల్లా	ఎస్‌బీ-3, అన్నమయ్య
డి.మురళీధర్ రెడ్డి	కర్నూలు త్రీటౌన్ పీఎస్	సీసీఎస్-2, కర్నూలు
పి.శేషయ్య	కర్నూలు వన్‌టౌన్ పీఎస్ (అడిషినల్ పోస్టు) అటాచ్డ్ టూ సీసీఎస్ కర్నూలు	కర్నూలు త్రీటౌన్ పీఎస్
పి.నాగశేఖర్	పీసీఆర్, ఆదోని, కర్నూలు	కర్నూలు వన్‌టౌన్ పీఎస్ అడిషినల్ పోస్టు
ఎం. సోనక్క	వీఆర్, కర్నూలు	పీసీఆర్, ఆదోని, కర్నూలు
బి.వెంకట చలపతి	ఎస్‌బీ-3, అన్నమయ్య	ఆలూరు సర్కిల్, కర్నూలు
కే.శ్రీనివాస నాయక్	ఆలూరు సర్కిల్, కర్నూలు	వీఆర్, కర్నూలు
ఎ.మోహన్ కుమార్	డీసీఆర్‌బీ, అన్నమయ్య	ఉమెన్ పీఎస్-2, అన్నమయ్య (మదనపల్లి ట్రాఫిక్)
కే.ఎరిషావలి	డీఎస్‌బీ-2, నంద్యాల	మదనపల్లి వన్‌టౌన్ పీఎస్, అన్నమయ్య
ఎ.చాన్ బాషా	మదనపల్లి వన్‌టౌన్ పీఎస్, అన్నమయ్య	వీఆర్, అన్నమయ్య
ఎ.సత్యనారాయణ	వీఆర్, అన్నమయ్య	డీఎస్‌బీ-2 అన్నమయ్య
జే.శంకరయ్య	డీఎస్‌బీ-2, అన్నమయ్య	డీసీఆర్‌బీ, అన్నమయ్య
జి.మారుతి శంకర్	వీఆర్, కర్నూలు	సోషల్ మీడియా అండ్ సైబర్ క్రైమ్ సెల్, నంద్యాల

అసభ్యకర పోస్టులు దారుణం : ఎంపీ



మాట్లాడుతున్న ఎంపీ శబరి

నంద్యాల రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో వైసీపీ అసభ్యకర పోస్టులు పెట్టడం దారుణమని నంద్యాల ఎంపీ, లోక్‌సభ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. నంద్యాలలోని స్వగృహంలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ అధికారం పోయిందన్న అక్కసుతో వైసీపీ నాయకులు సోషల్ మీడియాలో టీడీపీ, జనసేన మహిళలపై అసభ్యకరంగా రాస్తూ పోస్టులు పెట్టడం బాధాకరమన్నారు. పోస్టింగ్‌లు చూస్తే వైసీపీ నాయకులు మనషులేనా? అన్న సందేహం కలుగుతోందన్నారు. డిప్యూటీ సీఎం కూతుర్లపై, హోం మంత్రి అనితపై సోషల్ మీడియా పోస్టింగ్‌లను చూస్తే వైసీపీ వాళ్ల అరాచక నైజమేమిటో అర్థమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు తీసుకుంటున్న చర్యలకు మద్దతుగా నిలుస్తామన్నారు. మహిళల జోలికొస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

మురుగు విషయంలో బంధువుల గొడవ

- కొడవలితో దాడి, ఒకరికి గాయాలు

పత్తికొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చక్కరాళ్ల గ్రామంలో ఇంటిముందు మురుగు విషయంలో జరిగిన గొడవలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు.. నెట్టెకంఠయ్య అనే వ్యక్తిపై చిన్నాన్న పెద్దనాన్న పిల్లలైన రాజు, అయ్యప్ప కొడవలితో దాడిచేశారు. ఇంటిముందు మురుగు విషయంలో మాటామాటా పెరిగి దాడి తీసింది. గాయపడ్డ నెట్టెకంఠయ్యను పత్తికొండ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అసభ్యకర పోస్టులపై చర్యలు తీసుకోండి

- పోలీసులకు ఫిర్యాదు చేసిన తెలుగు యువత అధికార ప్రతినిధి బత్తిన లోక్‌నాథ్



పత్తికొండలో ఫిర్యాదు చేస్తున్న బత్తిన లోక్‌నాథ్

పత్తికొండ, నవంబరు8(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఐటీ మంత్రి లోకేష్‌పై అసభ్యకరపోస్టులు పెట్టినవారిపై చర్యలు తీసుకోవాలని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిన లోక్‌నాథ్ కోరారు. శుక్రవారం ఆయన పత్తికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వారి గౌరవాన్ని కించపరుస్తూ విశాఖకు చెందిన వెంకటేష్, గొల్లపవన్ పోస్టులు పెట్టడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చశారు. వారిపై సైబర్ క్రైం చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ జయన్న తెలిపారు.

అరుదైన శస్త్ర చికిత్స

- కాలేయంలో కణితిని తొలగించిన పెద్దాసుపత్రి వైద్యులు



శస్త్ర చికిత్స చేసిన వైద్యులతో రోగి

కర్నూలు హాస్పిటల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పాణ్యం మండలం గగ్గటూరు గ్రామానికి చెందిన 35 ఏళ్ల రోగికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జనరల్ సర్జరీ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. శుక్రవారం రోగి డిశ్చార్జి అవుతున్న సందర్భంగా వైద్యులు పత్రికా సమావేశంలో వివరాలు వెల్లడించారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన రవి గత సంవత్సరం నుంచి కడుపు నొప్పితో బాధపడుతు న్నారు. ఇటీవల నంద్యాల జీజీహెచ్‌కు వెళ్లగా అక్కడి వైద్యులు సిటీ స్కాన్ పరీక్ష నిర్వహించి కాలేయంలో గడ్డ ఉందని, కర్నూలు పెద్దాసుపత్రికి వెళ్లాలని సూచించారు. దీంతో రోగి గత నెల 5న ఎంఎస్-5వ యూనిట్‌లో చేరారు. ఆ యూనిట్ చీఫ్ డా.కే. మాధవి శ్యామల రోగికి అన్ని పరీక్షలు నిర్వహించారు. కాలేయంలో 18 సెంటీమీటర్ల మ్యూసినస్ సిస్ట్ (కణితి) అడినోమా ఉన్నట్లు గుర్తించారు. ఇది కాలేయం ఎడుమ లోబు మొత్తం ఆక్రమించింది. దీంతో రోగికి సర్జరీ చేయాలని యూనిట్ చీఫ్ డా.మాధవీ శ్యామల నిర్ణయించారు. గత నెల 16వ తేదీన డా.మాధవీ శ్యామల, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.చంద్రారెడ్డి, డా.శృతి, అశ్విని సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.సురేష్ కుమార్ సహకారంతో కాలేయంలోని గడ్డను తొలగించి ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈ ఆపరేషన్ చేయడానికి దాదాపు 5 గంటలు పట్టిందని, కాలేయంలో 15 సెంటీమీటర్ల కణితి ఉండటం ఇప్పటి వరకూ చూడలేదని డా.మాధవి శ్యామల తెలిపారు. రోగి ఆరోగ్యంగా ఉండటంతో డిశ్చార్జి చేశామని తెలిపారు.

నాన్ టీచింగ్ పోస్టుల్లో అమలుకాని ఇన్ సర్వీస్



జిల్లా సమగ్ర శిక్షణా కార్యాలయం

- ఫైనల్ జాబితాలో కనిపించని పేర్లు
- న్యాయం చేయాలంటున్న అభ్యర్థులు

ఆలూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష పరిధిలో ఉన్న కేజీబీవీ, మోడల్ గర్ల్స్ హాస్టల్స్‌లో ఖాళీగా ఉన్న ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీలో ఇన్‌సర్వీస్ అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వలేదు. శుక్రవారం విడుదల చేసిన ఫైనల్ జాబితాలో తమ పేర్లు కనిపించలేదని వారు తీవ్ర ఆందోళన చెందారు. జిల్లాలో మోడల్ హాస్టల్స్‌లో ఖాళీగా ఉన్న 6వార్డెన్ పోస్టులు, కేజీబీవీ మోడల్ హాస్టల్స్‌లో ఖాళీగా ఉన్న 51పోస్టులలో చౌకిదార్, వాచ్‌మెన్‌లు, స్కావెంజర్, కుక్స్ భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు.. అయితే టీచింగ్‌లో మాత్రమే సర్వీస్ పాయింట్లు పరిగణలోకి తీసుకోగా నాన్ టీచింగ్ పోస్ట్ల భర్తీలో విద్యాశాఖ అధికారులు సర్వీస్ పాయింట్లు పరిగణనలోకి తీసుకోకపోవడంతో ఏళ్ళ తరబడి డైలీ వేజెస్ విధానంలో విధులు నిర్వహిస్తున్న చిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారు.. నాన్ టీచింగ్ పోస్టుల భర్తీలో ప్రధానంగా వయసు, కుల ప్రాతిపదికన పోస్టు భర్తీ చేశామని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ శ్యామ్యూల్ పాల్ తెలిపారు.. ఇన్నాళ్లు తాము చేసిన సేవలను పరిగణనలోకి తీసుకోకుండా ఎలాంటి అనుభవం లేని వారికి పోస్టులు కేటాయించారని అధికారుల తీరుపై మండిపడుతున్నారు. రోజు కూలీ పద్ధతిలో ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న మహిళా కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఇన్‌సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకొని వారిని న్యాయం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు రమేష్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు..

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

11 నుంచి ఆధార్ క్యాంపు

పాములపాడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు పాములపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఆధార్ కార్డులలో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చన్నారు. ఈ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డీఎస్సీ ఉచిత కోచింగ్ స్క్రీనింగ్ టెస్ట్ వాయిదా

ఆత్మకూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఉచిత శిక్షణ కోసం నంద్యాల జిల్లాలో నవంబరు 10వ తేది నుంచి జరగాల్సిన స్క్రీనింగ్ టెస్ట్‌ను వాయిదా వేసినట్లు ఆత్మకూరు సహాయ సాంఘిక సంక్షేమ అధికారి బట్టు అంకన్న తెలిపారు. ఈసందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పలు జిల్లాల్లో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరీక్షలను వాయిదా వేసినట్లు తెలిపారు. తదుపరి తేదీలను త్వరలోనే వెల్లడిస్తామని చెప్పారు. డీఎస్సీ ఉచిత శిక్షణ కొరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక దీపారాధనలు

శ్రీశైలం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. ఆలయ ముందుభాగంలో దీపారాధనలు నిర్వహించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ఉత్తర మాఢవీధి ప్రాంగణం వద్ద, దేవాలయం ఎదురుగా ఉన్న గంగాధర మండపం వద్ద విశేష పూజలు నిర్వహించుకుని దీపారాధనలను జరిపారు. అలాగే పలువురు భక్తులు లక్ష వొత్తుల నోములు నిర్వహించారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు తాగునీరు, బిస్కెట్లు, అల్పాహారం అందజేశారు. సాయంత్రం ఆలయ ధ్వజస్తంభం వద్ద శాస్త్రోక్తంగా ఆకాశ దీపం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఆకాశదీప ప్రజ్వలనకు ముందుగా అర్చకులు సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్య క్రమం నిర్విఘ్నంగా జరిగాలని గణపతి పూజను నిర్వహించి, దీపప్రజ్వలన, దీపారాధనలు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా భక్తులకు శని, ఆది, సోమవారాల్లో స్వామివారి అలంకరణ దర్శనం మాత్రమే కల్పించనున్నారు.



నృత్యం చేస్తున్న కళాకారులు



ఆకాశ దీపోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఇన్‌చార్జి ఈవో

స్వామి, అమ్మవార్లకు ఊయల సేవ

శ్రీశైలం మహాక్షేత్రంలో లోక కల్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయల సేవను ఘనంగా నిర్వహించారు. ముందుగా మహా గణపతి స్వామికి పూజలు జరిపించారు. గ్రామదేవత అంకాలమ్మకు విశేష పూజలు నిర్వహించారు. ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో శుక్రవారం సాయంత్రం విజయవాడకు చెందిన పంచమ వేదనృత్యాలయం బృందంతో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. తరువాత కార్యక్రమంలో కర్నూలుకు చెందిన డి.లక్ష్మీమహేష్ భాగవతార్ బృందంతో శివపార్వతీ కల్యాణంపై హరికథగానం చేయగా, కీబోర్డు సహకారాన్ని బి. ఆంజనేయులు, మృదంగ సహకారాన్ని బి. ప్రసాద్ అందించారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

● కొత్తపల్లి తహసీల్దార్ ఉమారాణి

[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ]



కొత్తపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కొత్తపల్లి తహసీల్దార్ ఉమారాణి అన్నారు. ఆమె ఆంధ్రజ్యోతితో ఇంటర్వ్యూలో మాట్లాడారు..

ప్రశ్న: మండలంలో కొందరు వ్యక్తులు చెరువుల భూములను ఆక్రమించుకుని ఆన్‌లైన్ చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వీటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: నేను ఇక్కడికి వచ్చి రెండు నెలలు అయింది. క్షేత్ర స్థాయిలో పరిశీలించి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటాం.

ప్ర: వారసత్వపు హక్కు గల భూములను ఆన్‌లైన్ చేసుకోవచ్చా?

జ: పెద్దల ద్వారా వారసత్వపు హక్కుగా వచ్చిన భూములను వారి పెద్దల ద్వారా విడిభాగాల హక్కులు రాయించుకున్నట్లయితే ఆన్‌లైన్ చేయించుకోవచ్చు.

ప్ర: మండలంలో గతంలో కొందరు వ్యక్తులు అధికారులతో కుమ్మక్కై ప్రభుత్వ భూములు కూడా ఆన్‌లైన్ చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి.? మీ దృష్టికి వచ్చిందా?

జ: ఈ విషయం మా దృష్టికి కూడా వచ్చింది. ఎవరైతే ఆన్‌లైన్ చేయించుకున్నారో అందుకు బాధ్యులైన వారిపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణ చర్యలు తీసుకుంటాం.

ప్ర: మండలంలో ఎన్‌హెచ్ 167కే కింద రహదారుల నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించారా?

జ: ఎన్‌హెచ్ 167కే కింద భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించాల్సిన ఫైలు జాయింట్ కలెక్టర్ దగ్గర ఉంది. వారికి త్వరలోనే పరిహారం అందించేందుకు కృషి చేస్తాం.

ప్ర: వీఆర్వోలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో లేరన్న ఆరోపణలు ఉన్నాయి? వీటిపై మీరు ఎలా స్పందిస్తారు?

జ: ఇటీవలే గ్రామ రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించాం. కచ్చితంగా ప్రతిరోజు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం.



ఐక్య సంఘాలను ప్రక్షాళన చేస్తాం: ఎమ్మెల్యే

ఆత్మకూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మెప్మా విభాగంలోని ఐక్య సంఘాలను పక్షాళన చేసి తీరుతామని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డులో పొదుపు మహిళలతో ముఖాముఖి సమావేశాన్ని నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో 40 వరకు ఐక్య సంఘాలు ఉండాల్సినప్పటికీ ప్రస్తుతం కేవలం 24 సంఘాలు మాత్రమే ఉన్నాయని అందులో కూడా సభ్యులు ఎవరున్నారో తెలియని పరిస్థితి నెలకొందని అన్నారు. వీటన్నింటిని పక్షాళన చేసి అర్హులైన సంఘాలను కొనసాగిస్తామని వివరించారు. మహిళా సంఘాలకు రాజకీయాలతో పనేంటని ప్రశ్నించారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి తమ సంఘాలను బలోపేతం చేసుకోవాలే తప్ప రాజకీయాల జోక్యం సరికాదని అన్నారు. గతంలో తప్పులు చేసిన వారిని వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. మెప్మా అధికారులు అర్బన్‌కాలనీలో ఉన్న మెప్మా భవనాన్ని మరమ్మత్తులు చేసి తమకు అప్పగించాలని ఎమ్మెల్యే బుడ్డాను కోరడంతో అందుకు సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశానికి మెప్మా టీఎంసీ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు వంగాల శివరామిరెడ్డి, వేణుగోపాల్, శివప్రసాద్‌రెడ్డి, కలిముల్లా, అబ్దుల్లాపురం బాషా, నూర్‌బేగ్ ఉన్నారు.



మాట్లాడుతున్న శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



హాజరైన పొదుపు సంఘాల మహిళలు

'దోబీ ఘాట్ స్థలాలను పరిరక్షించాలి'

ఆత్మకూరులోని కొత్తపల్లి రస్తాలో పడేవాగు పక్కన దోబీ ఘాట్ స్థలం ఆక్రమణకు గురికాకుండా రియల్ ఎస్టేట్ వ్యక్తుల నుంచి పరిరక్షించాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ కోరారు. శుక్రవారం ఆత్మకూరులోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే వెంటనే తహసీల్దార్ రత్నరాధికకు ఫోన్ చేసి దోబీ ఘాట్ స్థలం ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంఘం నాయకులు శివుడు, వెంకటస్వామి, శివ, నాగార్జున తదితరులు ఉన్నారు.

కార్యకర్త కుటుంబానికి చేయూత

ఆత్మకూరు పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్త, లారీ కట్ట మేస్త్రీ ఇటీవల ఆకస్మిక మరణం పొందడంతో ఆటోనగర్ యూనియన్ తరుపున రూ.లక్ష బాధిత కుటుంబానికి అందజేశారు. శుక్రవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా సాయం అందించారు.

'పనుల్లో నాణ్యత పాటించాలి'



సీసీ రోడ్లను పరిశీలిస్తున్న చీఫ్ ఇంజనీర్ విజయకుమారి

గడివేముల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంలో మంజూరైన సీసీ రోడ్ల నాణ్యత ప్రమాణాలను పాటించాలని చీఫ్ ఇంజనీర్ విజయకుమారి అన్నారు. మండలంలోని పెసరవాయి గ్రామంలోని సీసీ రోడ్లను శుక్రవారం ఆమె పరిశీలించారు. సీసీ రోడ్ల నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు వివరించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పీఆర్ ఏఈ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మహానందిలో దేవదాయశాఖ ఎస్ఈ



మహానందిలో దీపోత్సవాన్ని నిర్వహిస్తున్న సతీష్ దంపతులు

మహానంది, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకొని దేవదాయశాఖ ఎస్ఈ సతీష్ దంపతులు శుక్రవారం మహానంది క్షేతంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో కోటి వత్తులతో దీపాల పూజ నిర్వహించారు. అనంతరం ఎస్ఈ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోని ఆర్ఎస్ రంగాపురం మద్దిలేటి స్వామి ఆలయం ప్రాకారంకు రూ.8 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని చెప్పారు. అలాగే కర్నూలు జిల్లాలోని ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో నాలుగు రాజగోపురం నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. త్వరలోనే కుంభాభిషేకం జరిపి అందులో భాగంగా రాజగోపురాలను కూడా ప్రారంభిస్తామని ఎస్ఈ తెలిపారు. ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు యాదవ్ ఉన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు: డీఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

గడివేముల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డీఈవో జనార్దన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పదోతరగతి, ఇంటర్ విద్యార్థులతో సమావేశమయ్యారు. విద్య ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకొని మంచిగా చదువుకోవాలని సూచించారు. పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని అన్నారు. సులభ రీతిలో విద్యార్థులకు బోధన చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థి సామర్థ్యాన్ని పెంచే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని అన్నారు. రికార్డులను పరిశీలించారు. ఎంఈవో విమల వసుంధరాదేవి, కేజీబీవీ ప్రిన్సిపాల్ రుబినా అఫ్రిన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

13 నుంచి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

నంద్యాల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): క్రీడా భారతి ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి నంద్యాలలోని రామకృష్ణ పీజీ కళాశాల కాశిరెడ్డినాయన ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి సబ్‌జూనియర్ అండర్-13, అండర్ - 15 బాల, బాలికల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడా భారతి ప్రతినిధులు డా.రామకృష్ణారెడ్డి, సుధాకర్‌లు తెలిపారు. శుక్రవారం నంద్యాలలోని రామకృష్ణ పీజీ కళాశాలలో పోటీల కరపత్రాలను వారు విడుదల చేశారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ బాల, బాలికలకు విడివిడిగా పోటీలు నిర్వహిస్తామని, ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్‌కార్డుతో పాటు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. వివిధ క్రీడల్లో ప్రతిభావంతులను గుర్తించి వారికి సరైన సహాయ సహకారాలు అందించి క్రీడల్లో రాణించేందుకు క్రీడాభారతి కృషి చేస్తుందని అన్నారు. పేర్ల నమోదుకు 8985829434, 9700802189 నెంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



'11న ధర్నాను జయప్రదం చేయాలి'

మిడుతూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 11న నంద్యాలలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రఘురాంమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని నాగలూటి, పైపాలెం, కడుమూరు గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ జగన్ హయాంలో కార్మికులకు అన్యాయం చేశారని ఆరోపించారు. కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ధర్నాకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాపీ వర్కర్స్ యూనియన్ నాయకులు అబ్దుల్ సుభాన్, సత్యరాజు, అంకన్న, అబ్దుల్ వకీల్, గఫూర్, నియాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

పాణ్యం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం డేటాసైన్స్ విభాగం ఆధ్వర్యంలో సేల్స్‌ఫోర్స్ సీఆర్ఎం సాఫ్ట్‌వేర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. రష్అప్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో నాగేంద్ర వక్తగా వ్యవహరించారు. డేటా సైన్స్ సొల్యూషన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సమ్మేళిత ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, హెచ్‌వోడీలు డేవిడ్ సుకీర్తి, ఫరూక్, రమాదేవి, అధ్యాపకులు వెంకటేశ్‌నాయక్, రేష్మా, సల్మా, చరణ్‌కుమార్ పాల్గొన్నారు.

సౌత్ జోన్ క్రీడా పోటీలకు ఆర్జీఎం కళాశాల విద్యార్థులు



క్రీడాకారులను అభినందిస్తున్న స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి

పాణ్యం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఆలిండియా సౌత్ జోన్ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్ తెలిపారు. శుక్రవారం పులివెందుల జేఎన్‌టీయూ కళాశాలలో జరిగిన జేఎన్‌టీయూఏ హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికలో పురుషుల విభాగంలో ఈసీఈకి చెందిన వి. మణికంఠ, బి.యాదవేంద్రారెడ్డి, మహిళా విభాగంలో ఎస్. సురేఖ ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను జేఎన్‌టీయూఏ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి జోజిరెడ్డి, ఆర్జీఎం కళాశాల చైర్మన్ డాక్టర్ శాంతిరాముడు, ఎండీ శివరాం, సిబ్బంది, అభినందించారు.

పగిలిన పైపులైన్.. తాగునీరు వృథా



పైపు పగలడంతో వృథాగా పోతున్న నీరు

వెలుగోడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వెలుగోడు నుంచి గుంతకందాల, వేంపెంట గ్రామాలకు తాగునీరు అందించే పైపు పిల్లకాల్వ సమీపంలో పగిలిపోయింది. దీంతె నీరు చిమ్ముతూ ఉండటంతో గ్రామాల్లోని ట్యాంకులకు నీరు ఎక్కడం లేదు. పైగా విద్యుత్ కూడా వృథా అవుతోంది.

1న వనభోజన మహోత్సవం


నంద్యాల రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 1న పట్టణ శివారు ప్రాంతమైన మూలమఠంలో కాపు, బలిజల వనభోజన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘ నాయకులు వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. వనభోజన ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. కుల మతాలకు అతీతంగా, ప్రాంతాలతో సంబంధం లేకుండా పాల్గొనాలని సూచించారు. గిరి, తోట ధనుంజయుడు, తోట భూపాల్, గాజుల శ్రీను, కిట్టు పాల్గొన్నారు.



'ఓటరుగా నమోదు చేసుకోండి'

పాములపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హత కలిగిన యువతీ యువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సుభద్రమ్మ తెలిపారు. పాములపాడు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఈ నెల 9, 10, 23, 24 తేదీల్లో మండలంలోని అన్ని గ్రామాలలో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18ఏళ్ల వయసు పూర్తయిన వారు అర్హులని, వీరు ఫారం 6ను సమర్పించాలని తెలిపారు. ఓటు తొలగింపునకు ఫారం 7, మార్పులు, చేర్పుల కోసం ఫారం 8 సమర్పించాలని తెలిపారు. బీఎల్‌వోలు విధి నిర్వహణలో సమయా పాలన పాటించాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు.

ఆత్మకూరు: ఆత్మకూరు మండలంలో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదును యువత సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, తహసీల్దార్ రత్నరాధిక సూచించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో ఈ నెల 9, 10, 23, 24 (శని, ఆదివారాలు) తేదీల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు (ఫారమ్-6), ఓటరు జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే (ఫారమ్-7), ఓటరు కార్డు నందలి సవరణల కొరకు (ఫారమ్-8) ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు.



అనధికార విద్యుత్ కనెక్షన్లపై దృష్టి సారించాలి


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రాజేష్

డోన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అనధికార విద్యుత్ కనెక్షన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగంతో పాటు సచివాలయం అమ్యూనిటీస్, ఎలక్ట్రిషన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజేష్ మాట్లాడుతూ పట్టణంలో వీధి లైట్లకు సంబంధించి కరెంటు బిల్లులు ఐదునెలలుగా ఎక్కువగా వస్తున్నాయన్నారు. ప్రతి నెలా రూ.1.50లక్షలు అదనంగా కరెంటు బిల్లులు వస్తుండటం వల్లన భారం పడుతుందన్నారు. ఇలా ఎందుకు జరుగుతుందని మున్సిపల్ డీఈ రఘును వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదే విదంగా పట్టణంలో అనధికార విద్యుత్ కనెక్షన్లను కట్టడి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నేడు ప్రత్యేక ఓటరు నమోదు

డోన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భారత ఎన్నికల కమిషన్, రాష్ట్ర ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం డోన్ నియోజకవర్గంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డోన్ తహసీల్దార్ నాగమణి శుక్రవారం తెలిపారు. ఈ నెల 9, 10, 23, 24 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొత్తగా ఓటరు నమోదు చేసుకోవచ్చని, ఇప్పటికే ఓటరుగా ఉండి ఓటరు కార్డులో ఏమైనా మార్పులు, చేర్పులతో పాటు చిరునామా మార్పులు కూడా చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనివిజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు అవగాహన

చాగలమర్రి: వయోజనులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రవికుమార్ శుక్రవారం తెలిపారు. శుక్రవారం వాసవీ కళాశాలలో ఓటరు నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శుక్రవారం నుంచి ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో వాసవీ కళాశాల ప్రిన్సిపాల్ షాబుద్దీన్, ఆర్ఐ సత్తార్, టెక్నికల్ అధికారి హుసేన్‌బాబు, ఎన్ఎస్ఎస్ అధికారి మహేశ్వరయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం


చెక్కు పంపిణీ చేస్తున్న ఎంపీ శబరి

శిరివెళ్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయనిధి పేదలకు వరమని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. శుక్రవారం రుద్రవరం మండలం యర్రగుడిదిన్నె గ్రామానికి చెందిన కంచర్ల కృష్ణ చైతన్యకు మంజూరైన రూ.2,28,700 సీఎం సహాయ నిధి చెక్కును బాధితుడికి ఎంపీ అందజేశారు. కార్యక్రమంలో తానా అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్, టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, కుందూరు మోహన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుచిని సేవ


మద్దిలేటి స్వామి క్షేత్రం మాడ వీధుల్లో స్వామి అమ్మవార్ల ఊరేగింపు

బేతంచెర్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహ స్వామి, మహాలక్ష్మీ అమ్మవారి క్షేత్రంలో తిరుచిని సేవ శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఆలయ ఈవో రామాంజనేయులు సమక్షంలో స్వామి అమ్మవార్లను ప్రత్యేక పల్లకిలో ఏర్పాటు చేసి ఆలయ మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవి పల్లకీ సేవ


పల్లకిపై అమ్మవారి ఊరేగింపు

బనగానపల్లె, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందవరంలో వెలసిన చౌడేశ్వరీ అమ్మవారు శుక్రవారం పల్లకిలో నిర్వహించారు. ఆలయ ఈవో కామేశ్వరమ్మ ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టు వస్త్రాలు, పుష్పాలతో పల్లకిలో అలంకరించి పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి అమ్మవారి పల్లకీ సేవలో పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు శ్రమించాలి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం శ్రమించాలని పూర్వ విద్యార్థి, దాత శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని వైపీపీఎం ప్రభుత్వ పాఠశాలతో పాటు జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన పీసీ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాత శ్రీనివాసరెడ్డి, మిత్ర బృందం శుక్రవారం క్రీడా దస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గంగన్న, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మధు శేఖర్, హెచ్ఎం వీరరాఘవయ్య, విశ్రాంత ప్రిన్సిపాల్ లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రానికి తాళం

రుద్రవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసాపురం రైతు భరోసా కేంద్రం తాళం శుక్రవారం తెరవలేదు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వీఏఏ సునీతకు ఏతఃవోగా పదోన్నతి రావడంతో బదిలీపై వెళ్లారు. ఇక్కడ రైతులకు అందాల్సిన సలహాలు సూచనలు అందడంలేదు. రైతు భరోసా కేంద్రానికి తలుపులు తెరిస్తే రైతులకు సలహాలు సూచనలు పొందేందుకు అవకాశం ఉంటుందని రైతులు తెలిపారు.

ధాన్య కేంద్రంలా ఆరోగ్య వెల్‌నెస్ సెంటర్



వెల్‌నెస్ సెంటర్ ఎదుట ఆరబోసిన వరి ధాన్యం

రుద్రవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిత్తరేణి పల్లె గ్రామంలో ఆరోగ్య వెల్‌నెస్ కేంద్రం ముందు వరి ధాన్యం ఆరబోశారు. మరో లారీ ఉంచారు. శుక్రవారం వెల్‌నెస్ కేంద్రంలో 104 ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇలా ఉంటే రోగులు ఎలా వెళ్తారని స్థానికులు ప్రశ్నించారు. వెల్‌నెస్ కేంద్రం ముందు వరి ధాన్యం ఆరబోసి లారీ నిలబెట్టారు మేము ఎలా వెళ్లాలని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

- మీర్జాపురం - పేరుసోముల మట్టి రోడ్డుకు మోక్షం
- రూ.30 కోట్లతో డబుల్ లైన్ రోడ్డు మంజూరు
- అంకిరెడ్డిపల్లె - తిమ్మనాయినిపేట రహదారికి మరో రూ.30 కోట్లు
- త్వరలో మొదలుకానున్న పనులు

కొలిమిగుండ్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో గ్రామీణ రోడ్లతో పాటు, ప్రధాన రహదారులకు మోక్షం లభిస్తోంది. రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి జిల్లావాసి కావడంతో బనగానపల్లె నియోజకవర్గంతో పాటు, ఉమ్మడి జిల్లాలోని రహదారుల సమస్యల పరిష్కారానికి చకచకా చర్యలు చేపడుతున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలోని సుమారు 60 కిలోమీటర్లు గ్రామీణ రోడ్లకు సీఆర్ఐఎఫ్ పథకం కింద ఇప్పటికే అనుమతులు లభించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఎన్నో ఏళ్లుగా శిథిలమైన మట్టి రోడ్డుతో రాకపోకలు నిలిచిపోయిన పేట్నీకోట నుంచి వయా కొలిమిగుండ్ల, మీర్జాపురం మీదుగా పేరుసోముల రహదారికి మోక్షం లభించింది. 12.60కిలోమీటర్లు డబులైన్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి రూ.30కోట్లు నిధులు మంజూరు కావడంతో ఈ రహదారి పనులు త్వరలోనే ప్రారంభం కానున్నట్లు ఆర్అండ్‌బీ అధికారులు వెల్లడించారు. సంజామల, కోవెలకుంట్ల మండలాల ప్రజలకు కొలిమిగుండ్ల మండలంతో అనుసంధానం ఏర్పడే ఎంతో కీలకమైన రహదారి ఇది. అంతే కాకుండా కొలిమిగుండ్ల నుంచి జిల్లాకేంద్రం నంద్యాలకు చేరుకోవడానికి సైతం ఈ డబుల్ లైన్ రహదారి అత్యంత కీలకంగా మారనుంది. ఏళ్ల తరబడి కలగా మారిన ఈ రహదారి నిర్మాణం ప్రారంభం కావడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు నంద్యాల-తాడిపత్రి రహదారిలో శిథిలావస్థకు చేరిన అంకిరెడ్డిపల్లె - తిమ్మనాయినిపేట మధ్య రహదారికి రూ.30కోట్లు మంజూరు కావడంతో ఈ రహదారి పనులు త్వరలో ప్రారంభంకానున్నాయి. ఈ నిర్మాణం పూర్తయితే వయా తిమ్మనాయినిపేట మీదుగా నంద్యాల-తాడిప్రతి ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా మారనుంది.


శిథిలావస్థకు చేరిన తిమ్మనాయినిపేట- అంకిరెడ్డిపల్లె రహదారి


డబుల్‌లైన్ బీటీ రోడ్డుగా మారనున్న మీర్జాపురం-పేరుసోముల రోడ్డు

ప్రజలకు ఎంతో మేలు



తాతల కాలం నుంచి ఉన్న కొలిమిగుండ్ల పేరుసోముల రహదారి సమస్యను మంత్రి పరిష్కరించడం సంతోషం. ఈ రహదారితో కొలిమిగుండ్ల, సంజామల మండలాల ప్రజలకు ఎంతో మేలు కలుగుతుంది.

- పోరెడ్డి చిన్నపురెడ్డి, మీర్జాపురం

మంత్రికి కృతజ్ఞతలు



మీర్జాపురం గ్రామానికి ఇది ఎంతో ఉపయోగకరం. గతంలో కొలిమిగుండ్ల, మీర్జాపురం రహదారి కూడా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డే ప్రారంభించారు. మంత్రికి కృతజ్ఞతలు. ఎంతో రుణపడి ఉంటాం.

- పిక్కిలి శ్రీరాముడు, స్థానికుడు

దెబ్బతిన్న కేపీ ఉల్లి పంట పరిశీలన


కేపీ ఉల్లి పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

చాగలమర్రి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలచెరువు గ్రామంలో దెబ్బతిన్న కేపీ ఉల్లి పంటను ఉద్యానశాఖ అధికారులు శ్రీధర్, సురేష్ శుక్రవారం పరిశీలించారు. కేపీ ఉల్లికి తెగుళ్లు.. ఆందోళనలో రైతులు అనే శీర్షిక 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. స్పందించిన అధికారులు చింతలచెరువు, కొలుములపేట, శెట్టివీడు గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించి కేపీ ఉల్లి తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉల్లిలో పర్పుల్‌బ్లాచ్(ఊదా మచ్చ తెగులు), స్టెమ్ బేసిల్‌రాట్ (కాండపు కుళ్లు తెగులు) తెగులు, రస్ట్ తెగుళ్లు (తుప్పు తెగులు) నివారణకు యాజినాల్ మూడు గ్రాములు ఒక లీటర్ నీటికి లేదా ప్రొఫినెట్ ఫ్లెస్‌సైమ్యాగ్జానిల్ 0.5 గ్రాములు ఒక లీటర్ నీటికి లేదా డైఫెన్‌కొనోజోల్ 0.2 మి.లీ ఒక లీటర్ నీటికి లేదా కోలరోథలోనిల్ 1.5 గ్రాములు ఒక లీటర్ నీటికి లేదా మెటాలాక్సిల్ రెండు గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి. 19:19:19, 5గ్రాములు మరియు ఫార్ములా4, 3 గ్రాములు మరియు మెగ్నీషియం సల్ఫేట్ 5 గ్రాములు ఒక లీటర్ నీటిని కలిపి పిచికారి చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఈవో సురేష్, పీఎంఎఫ్ఎంఈ డీఆర్పీ ఉదయ్, వీహెచ్ఏ దేవేంద్ర, ఉమామహేశ్వరి, చింతలచెరువు, కొలుములపేట, శెట్టివీడు గ్రామాల ఉల్లి రైతులు పాల్గొన్నారు.


వాహనాల రాకపోకలతో రేగుతున్న దుమ్ము

బస్టాండు దుమ్మూ ధూళిమయం

- ఇబ్బంది పడుతున్న ఆర్ఎస్ రంగాపురం గ్రామస్థులు

బేతంచెర్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బేతంచెర్ల-డోన్ ప్రధాన రహదారిలో ఉన్న జాతీయ రహదారి నిర్మాణంలో ఉండగా. రంగాపురం బస్టాండు ఇరువైపులా నిత్యం దుమ్ముధూళి ఇళ్లలోకి వెళుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ము లేయకుండా చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత కాంట్రాక్టర్, జాతీయ రహదారి అధికారులు చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దుమ్మూధూళీ వల్ల శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుని దుమ్మూధూళి రాకుండా కాంట్రాక్టరు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కార్యకర్తలందరూ సభ్యత్వం తీసుకోవాలి


చాగలమర్రిలో అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి కార్యకర్త సభ్యత్వం తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా తెలిపారు. శుక్రవారం న్యూబిల్డింగ్స్ వీధిలో టీడీపీ ఇన్‌చార్జి జెట్టి నాగరాజు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అన్సర్‌బాషా మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం నమోదుకు రాష్ట్రంలో విశేష స్పందన లభిస్తోందని అన్నారు. సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మౌళాలి, అనిఫ్, గౌస్‌మొద్దిన్, గఫార్, ప్రసాద్, సురేష్, రాజేష్, ఫరూక్ పాల్గొన్నారు.

చికెన్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలి


ఆళ్లగడ్డలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన కోళ్లను విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఏఎన్ఆర్ చికెన్ సెంటర్‌పై సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకుడు కుందూరు హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ చాంద్‌బాషా డిమాండ్ చేశారు. ఆళ్లగడ్డ పట్టణంలో కోళ్ల వ్యాపారం చేసుకోనివ్వకుండా తమను బెదిరిస్తున్నారని ఏఎన్ఆర్ చికెన్ దుకాణం యజమాని హుసేన్ బాషా, బీరువాల బాషా చేసిన ఆరోపణలను వారు శుక్రవారం ఖండించారు. పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలోని పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఏఎన్ఆర్ దుకాణం యజమాని కోళ్ల వ్యాపారం ముసుగులో అక్రమాలకు పాల్పడి రూ.కోట్లు గడించారని వారు ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ పైన, ప్రజాప్రతి నిధులపై బురద జల్లితే సహించేది లేదన్నారు. సమావేశంలో కౌన్సిలర్ హుసేన్ బాషా, ముబారక్ చికెన్ సెంటర్ యజమాని షరీఫ్ పాల్గొన్నారు.

ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

- డ్రైవర్‌కు తప్పిన ప్రమాదం

ఉయ్యాలవాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రూపనగుడి గ్రామసమీపంలో కుందూనది వంతెన వద్ద ఇటుకల లోడ్ వెళ్తున్న ట్రాక్టర్ ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం కోవెలకుంట్ల నుంచి పెద్దయమ్మనూరు గ్రామానికి ఇటుకలు తీసుకెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ముళ్ల పొదలు అధికంగా ఉండటంతో రోడ్డును అంచనా వేయలేక ఎదురుగా వస్తున్న లారీకి సైడ్ ఇచ్చే క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. డ్రైవర్ చాకచక్యంగా ప్రమాదం నుంచి బయట పడ్డాడు. ఈ ఘటనలో ఉయ్యాలవాడ, సుద్దమల్ల, పడిగెపాడు గ్రామాలకు నీటి సరఫరా అయ్యే పైపులైను పూర్తిగా దెబ్బతింది.

భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్ర నామ పారాయణం


పాత శివాలయంలో విష్ణు నామ పారాయణం చేస్తున్న మహిళలు

చాగలమర్రి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పాత శివాలయంలో కార్తీకమాసం సందర్భంగా శుక్రవారం ఎస్ఎస్ఎఫ్ మహిళల ఆధ్వర్యంలో సామూహికంగా విష్ణు సహస్ర నామ పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పార్వతిదేవికి సామూహిక ఒడిబియ్యం సమర్పించారు. శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం పల్లకి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ సంయోజిత ప్రతినిధులు భవాని, లక్ష్మీదేవి, మహిళలు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

చాగలమర్రి: చాగలమర్రిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం మహిళలు సామూహికంగా భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో అమ్మవారికిప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పసుపు, కుంకుమ, గాజులు, పండ్లు సమర్పించి ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారిని వెండి రథంలో కొలువుదీర్చి పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

దొర్నిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొర్నిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు సెపక్‌తక్రా క్రీడల్లో జిల్లాస్థాయిలో ప్రతిభకనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు తెలిపారు. కర్నూలులోని డీఎస్ఏ స్టేడియంలో జరిగిన పోటీల్లో కావ్యశ్రీ, అబిజాబి, అండర్-17 విభాగంలో సెపక్‌తక్రాలో ప్రతిభ కనబరిచారని అన్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో సి.బెళగల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ దేవేంద్ర, ఉపాధ్యాయులు ఉన్నారు.

బాక్సింగ్ పోటీలకు ..

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలోని బర్డ్స్ ఉన్నత పాఠశాల ఒకేషనల్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సింధూర శుక్రవారం తెలిపారు. మచిలీపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో 13మంది విద్యార్థులు పాల్గొంటారని అన్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ పాల్ రాజారావు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో బర్డ్స్ సిబ్బంది బర్నబాస్, రవికుమార్, మహేష్, వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

దొర్నిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రవికుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో ఇంటి పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో విమల, ఏఎన్ఎం మాణిక్యమ్మ, ఆశా వర్కర్లు లక్ష్మి, విజయలక్ష్మి ఉన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

- భర్త, అత్త, మామలపై కేసు నమోదు

శిరివెళ్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని జీనేపల్లె గ్రామానికి చెందిన ఇందిర అనే మహిళ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పీరయ్య శుక్రవారం తెలిపారు. జీనేపల్లెకు చెందిన ఇందిరను ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన వంశీ కృష్ణారెడ్డికి ఇచ్చి పెద్దలు వివాహం జరిపించారు. అనంతరం అదనపు కట్నం తీసుకుని రావాలంటూ ఆమె భర్త వంశీ కృష్ణారెడ్డి, మామ చెన్న కృష్ణారెడ్డి, అత్త రమాదేవి, ఆడపడచు వసుంధర వేధిస్తున్నారని బాధితురాలు ఫిర్యాదు చేయడంతో వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

నిందితుడికి మూడు నెలల జైలు శిక్ష

- రూ. 10వేలు జరిమానా

రుద్రవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన వై.చెన్నకేశవ అనే నిందితుడికి జైలు శిక్ష పడిందని ఎస్ఐ వర ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆళ్లగడ్డ పబ్లిక్ కోర్టు న్యాయాధికారి మురళీక్రిష్ణ మూడునెలలు జైలుశిక్ష, రూ. 10వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని వివరించారు. నిందితుడ్ని ఆళ్లగడ్డ సబ్‌జైలులో తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పులుల సంరక్షణకు చర్యలు

- శ్రీపతినాయుడు, రేంజర్, రుద్రవరం



రుద్రవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పులుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రేంజర్ శ్రీపతినాయకుడు తెలిపారు. ప్రకృతి సంపదను కాపాడుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: పెద్దపులుల సంరక్షణ కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: పెద్దపులుల సంరక్షణ కోసం బేస్‌క్యాంపులు ఏర్పాటు చేశాం. ఇప్పటికి నాలుగు బేస్‌క్యాంపులు ఉన్నాయి. మరో బేస్‌క్యాంపు ఏర్పాటు చేస్తున్నాం. ప్రొటెక్షన్ వాచర్లు అడవి లోపల ప్రతిరోజూ ఐదు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి పరిశీలిస్తున్నారు. వన్యప్రాణులకు హానీ కలిగిచొద్దని అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: వన్యప్రాణులకు హానీ కలిగిస్తే ఎలా కేసులు ఉంటాయి.

జవాబు: వన్యప్రాణులకు రైతులు హానీ తలపెట్టకూడదు. అలా తలపెడితే అటవీ చట్టం 1967 వన్యప్రాణి చట్టం 1972 కింద కేసులు నమోదు చేస్తాం. అటవీ సమీపంలో ఎవరైనా ఉచ్చులు వలలు ఏర్పాటు చేయకూడదు. జీవ వైవిధ్యంలో భాగంగా ప్రతి వన్యప్రాణిని కాపాడుతున్నాం .

ప్రశ్న: రుద్రవరం రేంజ్‌లో సిబ్బంది కొరత ఉంది కదా?

జవాబు: రేంజ్ పరిధిలో ఐదు సెక్షన్లు, 14 బీట్లు ఉన్నాయి. 42129 హెక్టార్లలో రేంజ్ విస్తరించి ఉంది. బీట్ ఆఫీసర్ల కొరత ఉంది. ఒక బీట్ నుంచి మరో బీట్ అధికారికి ఇన్‌చార్జి ఇచ్చాం.

ప్రశ్న: నల్లమల తీర గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారా?

జవాబు: నల్లమల తీరంలో రేంజ్ పరిధిలోని అన్ని గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశాం. జూలై 29న పెద్దపులి దినోత్సవం నిర్వహించాం, పాఠశాల విద్యార్థుల తో వన్యప్రాణులపై ర్యాలీ నిర్వహించాం. అవగాహన కల్పించాం. చట్టాలపై అవగాహన కల్పిస్తాం.

ప్రశ్న: నల్లమలలో ప్లాస్టిక్ వాడకం నిషేధించారా?

జవాబు: అటవిలో ప్లాస్టిక్ వాడకం ఎప్పటికప్పుడు నిషేధిస్తున్నాం. రేంజ్‌లో దేవాలయాలు ఉన్నాయి. వెళ్లే భక్తులకు ప్లాస్టిక్ వాడవద్దని సూచిస్తున్నాం. మిగిలిన వ్యర్థాలను పారవేయడం వల్ల వన్యప్రాణులకు ఇబ్బంది కలుగుతుంది. దైవ దర్శనం చేసుకుని రావాలి. అడవిలో మంటలు పెట్టి ఇబ్బందికి గురి చేయొద్దని సూచిస్తున్నాం. దేవాలయాలకు వెళ్లే భక్తులు సహకరించాలని కోరుతున్నాం.

'ఆర్థిక నేరస్తులపై చర్యలు తీసుకోవాలి'

డోన్ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక నేరస్తులపై పట్టణ పోలీసు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి మోటరాముడు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మోటరాముడు మాట్లాడుతూ పట్టణంలో రోజురోజుకు ఆర్థిక నేరాలు పెరుగుతున్నాయని అన్నారు. పట్టణంలోని శ్రీరామ థియేటర్ సమీపంలో ఒక వ్యక్తి రూ. లక్ష ఇస్తే.. వాటికి అధిక వడ్డీ ఆశ చూపి ఆర్థిక మోసానికి పాల్పడ్డాడని ఆరోపించారు. సదరు వ్యక్తిపై పోలీసు అధికారులు చీటింగ్ కేసు నమోదు చేసి వసూలు చేసిన కోట్లాది రూపాయలను తిరిగి బాధితులకు అప్పగించేలా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'కెమికల్ ఫ్యాక్టరీతో అనారోగ్యాలు'

డోన్ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉడుములపాడు గ్రామ సమీపంలో ఉన్న కెమికల్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే విషవాయువుల వల్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరుచుగా అనారోగ్యాలకు గురవుతున్నారని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు కోయలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఉడుములపాడు గ్రామ సీపీఎం శాఖ సమావేశంలో వారు మాట్లాడారు. కెమికల్ ఫ్యాక్టరీ వల్ల ఉడుములపాడు, జగదుర్తి, అభిరెడ్డిపల్లె గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కెమికల్ ఫ్యాక్టరీని జనావాసాలకు ఇబ్బంది లేకుండా దూరంగా కొండ పరిసరాల్లో మార్చాలని వారు డిమాండ్ చేశారు.

మా భూమిని ఆక్రమించారు

- తహసీల్దారుకు రైతు ఫిర్యాదు

ప్యాపిలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మా భూమిని ఆక్రమించుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని ఏనుగమర్రి గ్రామానికి చెందిన రైతు కుల్లాయప్ప కోరారు. శుక్రవారం తహసీల్దారు భారతికి ఫిర్యాదు చేశారు. ఏనుగమర్రి గ్రామంలో 733 సర్వే నెంబరులో తనకు రెండున్నర ఎకర పొలం ఉందని అందులో ఓ వ్యక్తి దాదాపు 40 సెంట్లు భూమిని ఆక్రమించుకొని దౌర్జన్యంగా రాళ్లు పాతారని ఆవేదన వ్యక్తం చేశారు. పొలాన్ని సర్వే చేసి ఆక్రమణకు గురైన పొలాన్ని తనకు ఇప్పించాలని కోరారు.

8,600 మందికి బీసీజీ వ్యాక్సిన్లు

కొలిమిగుండ్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : టీబీ వ్యాధి నివారణలో భాగంగా మండలంలో ఇప్పటి వరకు 8600మందికి బీసీజీ వ్యాక్సిన్లు వేసినట్లు కొలిమిగుండ్ల పీహెచ్‌సీ వైద్యుడు హరిచరణ్‌రెడ్డి తెలిపారు. 18సంవత్సరాలు నిండిన వారికి ఈ వ్యాక్సిన్లు అవసరాన్ని గుర్తించి బీసీజీ వ్యాక్సిన్లు వేస్తున్నట్లు ఆయన తెలిపారు. అవసరమైన ప్రతి ఒక్కరూ బీసీజీ వ్యాక్సిన్లు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ

కొలిమిగుండ్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో బహిరంగ మల విసర్జన రహిత సమాజం ఏర్పడితేనే ప్రజల సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని రామ్‌కో సిమెంట్ పరిశ్రమ యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు, ప్రెసిడెంట్ అడ్మిన్ రామారాజు అన్నారు. శుక్రవారం మండలంలోని కల్వటాల గ్రామంలో రామ్‌కో సిమెంట్ సీఎస్ఆర్ నిధులతో ఉచిత మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. తమిళనాడుకు చెందిన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ గ్రామాలయ వారి ఆధ్వర్యంలో మండలంలోని కల్వటాల, చింతలాయపల్లె, కోటపాడు, నాయినిపల్లె గ్రామాల్లో మొదటి విడతగా రూ.50లక్షల నిధులతో 100 వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు యూనిట్‌హెడ్ రెడ్డి నాగరాజు, రామరాజు తెలిపారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ కామిని సుమలత, క్రిష్ణరంగారెడ్డి, బాస్కరరెడ్డి, రామ్‌కో సీనియర్ జనరల్ మేనేజర్ రవికుమార్, గ్రామాలయ ప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వంలో న్యాయం'

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నీరు-చెట్టు పథకంలో పనులు చేసిన లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వంలో న్యాయం కలుగుతుందని మండలంలోని జంబులదిన్నె, బత్తులూరు గ్రామల ప్రజలు, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అభిమానులు అన్నారు. ఆయా గ్రామాల్లో సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెండింగ్‌లో ఉన్న బకాయిలను లబ్ధిదారులకు చెల్లిస్తామని ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో ఆమోదం తెలపడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.